## యథేచ్ఛగా మట్టి తరలింపు



పెద్దకంజర్ల శివారులో మట్టిని తవ్వుతున్న దృశ్యం

పటాన్‌చెరు, జూన్ 22: పెద్ద కంజర్ల శివారులో సర్వే నంబర్ 120,121, 125లోని ప్రభుత్వ భూమిలో నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. శనివారం రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టికోలేదని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్లలో కొద్ది రోజులుగా రాత్రి వేళలో జేసీబీలతో మట్టిని తవ్వుతున్నారు. తవ్విన మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో సీసీ పనులు



సీసీ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సిద్ది ప్రవీణ, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీడీవో

గుమ్మడిదల, జూన్ 22 : నూతన ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఎంపీపీ సద్దిప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్‌తో కలిసి ఎంపీడీవో ఉమాదేవి సీసీ పనులు ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ.9లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. అలాగే ఆ భవన ప్రాంగణంలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సద్దివిజయభాస్కర్‌రెడ్డి, మహ్మద్‌హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మద్దీప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో చండీ హోమం



చండీ హోమం నిర్వహించిన భక్తులు

గుమ్మడిదల, జూన్ 22: జిల్లాలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. శనివారం ఆలయ మాజీ చైర్మన్ గటాటి భద్రప్ప కుటుంబ సభ్యులు గటాటి రమేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు.

### బ్యాంకు మేనేజర్ బదిలీ

సిర్గాపూర్, జూన్ 22 : మండల పరిధిలోని వాసర్‌లో ఉన్న ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ తృప్తి సదాశివపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శనివారం బ్యాంకు అధికారులు, సిబ్బంది ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ప్రదీప్, క్యాషియర్ నరేశ్, ఐకేపీ వీవోఏ నాగయ్యస్వామి, బ్యాంకు మిత్ర రవినాయక్ పాల్గొన్నారు.

### కరెంట్ షాక్‌తో బర్రె మృతి

సిర్గాపూర్, జూన్ 22 : విద్యుదాఘాతానికి బర్రె మృతి చెందిన ఘటన మండలంలోని కడ్పల్ గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని రైతు బాల్‌రెడ్డికి చెందిన బర్రె స్థానిక శివారులో మేత కోసం వెళ్లింది. అక్కడ వేలాడుతున్న కరెంటు తీగలు బర్రె కొమ్ములో ఇరుక్కోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బాధిత రైతుకు నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు కోరారు.

## సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, జూన్ 22: ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ ప్రధాన బస్సు రోడ్డు మార్గంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ బల్దియా విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపారు. శనివారం వార్డు కార్యాలయంలో బల్దియా ఇంజినీరింగ్, విద్యుత్ శాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. మార్కెట్ బస్సు రోడ్డులో, గ్రంథాలయం నుంచి ఈఎస్ఐ రోడ్డు వరకు సీసీ రోడ్డు వేసి అక్కడి నుంచి హిందూ శ్మశానవాటిక వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్‌ని ఏర్పాటు చేయించాలన్నారు. రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ పోల్స్‌ని తొలిగించాలన్నారు. కార్యక్రమంలో డీఈ నరేందర్, ఏఈ ప్రభు, విద్యుత్ శాఖ ఏఈ లిఖిత తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలులో అవకతవకలు!



ఖాదిరాబాద్‌లో వడ్ల నాణ్యతను తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారులు(ఫైల్)

వట్‌పల్లి, జూన్ 22 : మండల పరిధిలోని ఖాదిరాబాద్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రంలో అవకతవకలు జరిగాయని రైతులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద అధికారులు వడ్లను పరీక్షించి కాంటా వేసి, తర్వాత ఆ ధాన్యానికి ఇచ్చే ధరను చిట్టిపై రాసి ఇచ్చారు. అయితే వారు రాసిచ్చిన నగదు కంటే తక్కువగా ఖాతాలో జమ కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారులను రైతులు అడిగితే రైస్‌మిల్లు యాజమాన్యం తరుగు రూపంలో తక్కువగా జమ చేస్తున్నదని నచ్చ చెబుతున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని రైతుల కోరుతున్నారు.

### తక్కువ జమయ్యాయి



నేను 34.40 క్వింటాళ్ల వడ్లు అమ్మాను. అధికారులు నాకు రూ.75,783 వస్తాయని చిట్టిపై రాసి ఇచ్చారు. అయితే బ్యాంకు ఖాతాలో రూ.68,733 జమ అయ్యాయి. ఈ విషయమై అధికారులను అడిగితే రైస్‌మిల్లులో తరుగు పోవడంతో డబ్బులు తక్కువ వచ్చాయని చెబుతున్నారు. రైతులకు న్యాయం చేయాలి.

*- పల్లె బాగయ్య, రైతు, ఖాదిరాబాద్*

# సుక్కలు చూస్తున్న నక్షత్రవనం

- మందుబాబులకు అడ్డాగా పల్లె ప్రకృతి వనాలు
- గాలికొదిలేసిన మొక్కల సంరక్షణ
- ఎండిన మొక్కలు.. బోర్డులే దర్శనం
- రూ.లక్షలు ఖర్చు చేసినా పచ్చదనం కనుమరుగు
- పట్టించుకోని అధికారులు







కులబ్‌గూర్ నక్షత్ర వనంలో ఎండిపోయిన మొక్కలు



కులబ్‌గూర్‌లో హరితహారంలో నాటిన చెట్లను నరికి వేసిన దృశ్యం

సంగారెడ్డి, జూన్ 22: ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన పనులను పర్యవేక్షిస్తే భవిష్యత్ తరాలకు మనుగడ సాధ్యమవుతుందనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూపుదిద్దుకున్న నక్షత్ర వనం చుక్కలు చూస్తున్నది. అప్పట్లో ప్రత్యేకంగా నక్షత్రాల పేర్లతో మొక్కలు నాటి గ్రామ పంచాయతీ పరిపాలనలో సుందరంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం అ వనానికి సంరక్షణ లేకపోవడంతో మొక్కలకు పేర్లు పెట్టిన బోర్డులే దర్శనమిస్తున్నాయి. మొక్కలు ఎండిపోవడంతో నక్షత్ర వనం వెలవెలబోతున్నది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడ కూర్చొని తాగి పడేసిన ఖాళీ బాటిళ్లు, పగిలిన సీసాలతో పాటు వాటర్ బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. ఇదంతా జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కులబ్‌గూర్ గ్రామంలోని నక్షత్ర వనం, పల్లె ప్రకృతి వనాల దుస్థితి.

**ప్రత్యేక అధికారుల పాలనలో..**

అప్పట్లో నక్షత్ర, పల్లె ప్రకృతి వనాలకు పలు అవార్డులు వచ్చిన విషయం తెలిసిందే. గ్రామ సర్పంచ్ పర్యవేక్షణలో ఉన్నంత వరకు వనాలకు ఎలాంటి డోకాలేదు. ప్రత్యేకాధికారుల పాలన రాగానే వనాల సంగతి ఇలా ఉంటే గ్రామాల్లో నాటిన మొక్కలు సైతం గొడ్డలి వేటుకు గురయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేస్తే పట్టించుకొనే వారే కరువయ్యారు. పల్లెలకు పచ్చదనంతో పాటు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు ప్రకృతి వనాలు ఎంతో ఉపయోగపడుతాయనే సంకల్పంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన ప్రకృతి వనాలు నేడు శిథిలావస్థకు చేరుకోవడం విడ్డూరంగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

**రూ.12లక్షలతో పల్లె ప్రకృతి వనం**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి పల్లె పచ్చదనంతో కళకళలాడలనే ఉద్దేశంతో ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. కులబ్‌గూర్‌లో రూ.12లక్షలతో పల్లెప్రకృతి వనం, రూ.లక్షతో నక్షత్ర వనాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మారగానే అధికారులు కూడా మారినట్లు గత ప్రభుత్వ హయాంలో రూపుదిద్దుకున్న అభివృద్ధిని కొనసాగించడంలో నిర్లక్ష్యం వహిస్తునట్లు స్పష్టమవుతున్నదని విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై మండల అభివృద్ధి అధికారిని ఫోన్‌లో సంప్రదించగా పల్లె ప్రకృతి వనానికి వెచ్చించిన నిధులు వివరాలు తెలియవన్నారు. మా కంప్యూటర్ ఆపరేటర్ రెండు రోజులు సెలవులో ఉన్నాడు. అపరేటర్ వచ్చాకా వివరాలు ఇస్తా అని బదులు చెప్పారు.



ఎండిపోయిన మొక్కలు.. దర్శనమిస్తున్న బోర్డులు



కులబ్‌గూర్ పల్లెప్రకృతి వనంలో మందుబాబులు

### మొక్కలను గాలికొదిలేశారు



మొక్కల సంరక్షణ బాధ్యతను ప్రస్తుత ప్రభుత్వం నీరుగార్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు ప్రజలకు ఎంతో మేలు చేసేవిధంగా ఉన్నాయి. మొక్కలు ఉంటే చెడు గాలిని పీల్చుకుని స్వచ్ఛమైన గాలిని ప్రజలకు అందిస్తాయి. అలాగే సకాలంలో వర్షాలు పడి సేద్యానికి అనుకూలంగా మారి పంటల దిగుబడికి దోహదం చేస్తాయి. గ్రామాల్లో సర్పంచ్‌ల పాలన ఉన్నపుడు ప్రకృతి వనాల సంరక్షణ బాగుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే గ్రామాల్లో పారిశుధ్యంతో పాటు మంచినీటి సరఫరా అస్తవస్త్యంగా మారింది. మా గ్రామంలోని నక్షత్ర వనం, పల్లె ప్రకృతి వనంలో నాటిన ఔషధ మొక్కల సంరక్షణకు అధికారులే బాధ్యత తీసుకొని కాపాడాలి.

**- కృష్ణ, మాజీ వార్డు సభ్యుడు, కులబ్‌గూర్**

## మాదారం ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం



విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్ఎం అంజయ్య, ఉపాధ్యాయులు

జిన్నారం, జూన్ 22: మాదారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు చదువుల తల్లి సరస్వతి మాతా చిత్రపటం వద్ద పూజలు చేశారు. అనంతరం కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులతో హెచ్ఎం అంజయ్య, ఉపాధ్యాయులు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సీఆర్పీ సుజాత, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రషర్ యంత్రాల పనులు నిలిపివేయాలి



రాళ్లకత్వ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

జిన్నారం, జూన్ 22 : రాళ్లకత్వ గ్రామ శివారులోని సర్వే నంబర్ 286లోని అసైన్డ్ భూమిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న క్రషర్ యంత్రాల పనులను నిలిపివేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శనివారం భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి హరితను కలిసి వినతిపత్రం అందజేశారు. క్రషర్ యంత్రాల ఏర్పాటుతో జరిగే నష్టాలను వివరించారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 22 : జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై పోలీసు, ఆబ్కారీ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. యువత డ్రగ్స్‌తో పాటు గుట్కా, గంజాయి, మాదక ద్రవ్యాలు, సిగరేట్ తదితర చెడు అలవాట్లకు సైతం దూరంగా ఉండాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు, రవాణా జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యాలయాలకు దూరంగా మద్యం షాపులు ఉండాలని, బెల్ట్ షాపులపై ఫిర్యాదు వస్తే వాటిని మూసివేయించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి నవీన్‌చంద్ర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గాయత్రీ దేవి, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి వసంతకుమారి, డీఈవో వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

### బర్దీపూర్ ఆశ్రమానికి భూదానం

మనూర్, జూన్ 22 : మండల కేంద్రానికి చెందిన నాగమణి మనూర్‌లోని పాండురంగ మందిరం పక్కన ఉన్న తన రెండు సొంత ప్లాట్ల స్థలాన్ని బర్దీపూర్ ఆశ్రమానికి దానం చేశారు. ఈ మేరకు శనివారం గ్రామస్తుల సమక్షంలో బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవదూతగిరి మహారాజ్‌కు స్థలానికి సంబంధించిన పత్రాలను అందజేశారు. అనంతరం ఈ స్థలంలో అవదూతగిరి మహారాజ్ పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు అంజయ్య, సాయిలు, మోహన్‌రెడ్డి, పాండురంగం, అశోక్ కుమార్, దత్తు, నర్సింహులు, నగేష్, గడిల విఠల్, శంకర్, రాంచెందర్, నర్సుగౌండ, ధర్మారెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

## జాతీయస్థాయి అవార్డులకు ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన కన్సాన్‌పల్లి విద్యార్థి స్రవంతి ప్రాజెక్టు



ఎంపికైన కవేలీ పాఠశాల విద్యార్థి మహ్మద్ ముస్తఫా అహ్మద్ పాజెక్టు

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 22: జిల్లా నుంచి రెండు ఇన్‌స్పైర్ మానక్ అవార్డులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి 9 ప్రాజెక్టులను ఆన్‌లైన్, వర్చువల్ మోడ్‌లో పంపించగా, ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి 26 ప్రాజెక్టులను ఎంపిక చేశారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా నుంచి జాతీయ స్థాయికి రెండు ప్రాజెక్టులు ఎంపికైన అవార్డు గైడ్ టీచర్లు, విద్యార్థులను ఆయన అభినందించారు. జాతీయ స్థాయికి ఎంపికైన వాటిలో 'సులభంగా డెస్కులను శుభ్రం చేసే యంత్రం' ప్రాజెక్టుతో అందోల్ మండలం కన్సాన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ 10వ తరగతి విద్యార్థినీ ఎ స్రవంతి, గైడ్ టీచర్ సిద్దేశ్వర్, 'వీధి దీపాలను సులభంగా మార్చే యంత్రం' ప్రాజెక్టుతో ఎంపికైన కోహీర్ మండలం కావేలి జెడ్పీహెచ్ఎస్ 10వ తరగతి విద్యార్థి మహమ్మద్ ముస్తఫా ఆహ్మద్, గైడ్ టీచర్ హజ్రా బేగం ఉన్నారు.



రాయికోడ్: నాగ్వార్‌లో ఎద్దులకు పూజలు చేసిన మాలీ పాటిల్ సాదక్‌పాటిల్

## ఘనంగా ఏరువాక పౌర్ణమి

రాయికోడ్, జూన్ 22 : మండల పరిధిలోని నాగ్వార్, ఇటిక్యాపల్లి, ఖామ్‌జమల్‌పూర్, శంశోద్దీన్‌పూర్, శాపూర్, పాంపాడు, సీరూర్, దౌల్తాబాద్ గ్రామాల్లో శనివారం ఘనంగా ఏరువాక వేడుకలు నిర్వహించారు. రైతులు పశువులను అలంకరించి పూజలు చేసి, ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించారు.

**అందోల్‌లో..**

అందోల్, జూన్ 22: నియోజకవర్గ పరిధిలో ఏరువాక పౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. పశువులను అందంగా అలంకరించి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.



అందోల్: నేరడిగుంటలో అందంగా అలంకరించిన ఎడ్లను ఊరేగిస్తున్న రైతులు

### నేడు రాధాగోవింద రథయాత్ర

కోహీర్, జూన్ 22: జహీరాబాద్ పట్టణంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు రాధాగోవింద రథయాత్ర నిర్వహిస్తామని హైదరాబాద్‌కు చెందిన హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ సభ్యులు తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని శివాజీ విగ్రహం వద్ద రథయాత్రను ప్రారంభిస్తామని వెల్లడించారు. పట్టణంలోని 65వ జాతీయ రహదారి గుండా శోభాయాత్ర కొనసాగి షెట్కార్ ఫంక్షన్ హాలు వద్ద ముగుస్తుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

### క్షతగాత్రుడికి ఆర్థిక సాయం అందజేత

బొల్లారం, జూన్ 22 : మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్‌లో నివసించే సయ్యద్ అమీర్ అనే యువకుడు ఇటీవల ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి పడి తీవ్రంగా గాయపడడంతో సూరారంలోని మల్లారెడ్డి దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కాంగ్రెస్ యువ నాయకుడు ప్రవీణ్ రెడ్డి శనివారం బాధితుడిని పరామర్శించి రూ.10వేలు అందజేశారు. ఆపరేషన్ ఖర్చులకోసం దాతలు ఆర్థికసాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక యువకులు అహ్మద్ జలీల్, షాన్వాస్, దిగంబర్, అజ్జు, చిన్ను తదితరులు పాల్గొన్నారు.

### బోరుకు మోటర్ బిగింపు

కంది, జూన్ 22 : తాగునీటి సమస్య పరిష్కరించేందుకు మామిడిపల్లిలో వేసిన బోరుకు నూతన మోటార్‌ను బిగించినట్లు ఎంపీవో మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం 1.5 హెచ్‌పీ సింగిల్ ఫేజ్ పంపు మోటార్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ మల్లేశ్, పంచాయతీ కార్యదర్శి స్వామి పాల్గొన్నారు.

### రేడియల్ రోడ్లపై బటర్‌ఫ్లై లైట్ల ఏర్పాటు

రామచంద్రాపురం, జూన్ 22 : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని నల్లగండ్ల–ఈదులనాగులపల్లి, గోపన్‌పల్లి తండా–కొల్లూర్ ఓఆర్ఆర్ రేడియల్ రోడ్లపై రూ.4.78కోట్లతో బటర్‌ఫ్లై లైట్లు ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. నవ నిర్మాణ అసోసియేట్స్, టార్గెట్ మీడియా సౌజన్యంతో డెవలప్‌మెంట్ బిల్ట్ ఫైనాన్స్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌వోటీ) పద్ధతిలో అత్యాధునిక లైట్లను రోడ్డుకు మధ్యలో ఏర్పాటు చేయించామన్నారు. ఈ లైట్ల ఏర్పాటుతో రోడ్డు ప్రమాదాలు తగ్గడంతో పాటు వాహనదారులకు మేలు జరుగుతుందన్నారు.

### భవానీ సేవాలాల్ ఉత్సవాలు ప్రారంభం

చౌటకూర్, జూన్ 22: మండల పరిధిలోని బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాలో శనివారం భవానీమాత, సేవాలాల్ మహారాజ్ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఏటా ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు రెండు రోజుల పాటు జరుగనున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకం, నూతన వస్త్రాలంకరణ తదితర ప్రత్యేక పూజలు చేశారు.

### ప్రమాదవశాత్తు యువకుడు మృతి

మునిపల్లి, జూన్ 22: ప్రమాదవశాత్తు నీటిలో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మక్తక్యాసారంలో శనివారం జరిగింది.. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మద్దూర్ కుమార్ (23) ఏరువాక పండుగ సందర్భంగా సింగూరు బ్యాక్ వా టర్‌లో ఎద్దులను కడిగి బయటకు వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మునిగి గల్లంతయ్యాడు. పోలీసులకు సమాచారం రావడంతో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టడంతో మృతదేహం లభించింది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని సదాశివపేట దవాఖానకు తరలించారు. మృతుడి అన్న రాకేశ్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

**జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీరాం సుధాకర్**



మామిడ్గిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న శ్రీరాం సుధాకర్

న్యాల్‌కల్, జూన్ 22: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అసిస్టెంట్ మలేరియా జిల్లా అధికారి శ్రీరాం సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని మామిడ్గిలో కొనసాగుతున్న ఇంటింటి సర్వే, క్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గ్రామంలో విషజ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించాలన్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, డ్రైనేజీల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తాచెదారం, మురికి నీరు నిల్వ ఉండడంతో మలేరియా, అతిసారం, డెంగీ, టైఫాయిడ్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. అనంతరం గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించారు. ఆయన వెంట ఆరోగ్య ఉప కేంద్రం వైద్యాధికారి హర్షవర్ధన్ రెడ్డి, సిబ్బంది శ్యామల, మల్లికార్జున్, చండీ దేవి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.